సరికొత్త ఫీచర్‌తో కియా సెల్టోస్ విడుదల

న్యూఢిల్లీ : కియా ఇండియా తన సెల్టోస్‌ను సరికొత్త అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్ (అడాస్)-2 ఫీచర్‌తో విడుదల చేసినట్లు ప్రకటించింది. భద్రతకు కొత్త ప్రమాణామని.. ఆధునిక టెక్నాలజీలో వివిధ ఇంటిలిజెంట్ ఫీచర్స్ కోసం ఆధునిక ఫార్వర్డ్ కొలిజన్ నివారించే అసిస్ట్, లేన్ కీప్ అసిస్ట్, స్టాప్ అండ్ గోతో స్మార్ట్ క్రూయిజ్ కంట్రోల్ సహా 1 కెమెరా, 3 రాడార్స్‌తో డ్రైవర్‌కు, ప్రయాణికులకు ఒకే విధంగా భద్రతను కలిగిస్తుందని తెలిపింది. నూతన సెల్టోస్ వాహన ధరల శ్రేణిని రూ.10.89 - రూ.19.99 లక్షలుగా పేర్కొంది.

కెనరా హెచ్‌ఎస్‌బిసి లాభాల్లో తొమ్మిది రెట్ల వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభాలు తొమ్మిది రెట్లు పెరిగి రూ.91.2 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.10.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన 2022-23లో పన్ను చెల్లింపులకు ముందు రూ.100 కోట్ల లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. ఇదే సమయంలో స్థూల ప్రీమియం వసూళ్లు 22 శాతం పెరిగి రూ.7,197 కోట్లుగా నమోదయినట్లు వెల్లడించింది. 2021-22లో రూ.5,890 కోట్ల ప్రీమియం చోటు చేసుకున్నట్లు తెలిపింది.

రిలయన్స్ లాభాల్లో 10.8 శాతం పతనం

న్యూఢిల్లీ : ముకేష్ అంబానికి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.8 శాతం పతనంతో రూ.16,011 కోట్ల లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.17,955 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ1లో కంపెనీ రెవెన్యూ 5.3 శాతం తగ్గి రూ.2.11 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. రిలయన్స్ రిటైల్ లాభాలు 18.8 శాతం పెరిగి రూ.2,448 కోట్లుగా నమోదయ్యాయి. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లాభాలు 12.2 శాతం పెరిగి రూ.4,863 కోట్లుగా చోటు చేసుకున్నాయి. శుక్రవారం బిఎస్‌ఇలో రిలయన్స్ షేర్ 2.57 శాతం పతనమై రూ.2536.20 వద్ద ముగిసింది.

త్వరలో గోఫస్ట్ సర్వీసుల పునరుద్ధరణ

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని రెండున్నర నెలల క్రితం విమానయాన సేవలను రద్దు చేసుకున్న గోఫస్ట్ సర్వీసులు త్వరలోనే పునరుద్ధరణకు నోచుకోనున్నాయి. ఇందుకు కొన్ని షరతులతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆమోదం లభించింది. ఈ నెల 15న గోఫస్ట్ తన విమాన సర్వీసుల పునరుద్ధరణ ప్రణాళికను సవరించింది. 15 విమానాలతో ప్రతి రోజూ 114 విమాన సర్వీసులు నడుపుతామని పేర్కొంది. ఈ సవరణ ప్రతిపాదనను ఆమోదించిన డిజిసిఎ తాజాగా కొన్ని షరతులతో సేవల పున ప్రారంభానికి అనుమతులు ఇచ్చింది.

'నో క్యాస్ట్.. నో రిలీజియన్' కాలంపై హైకోర్టు హర్షణీయం

- జస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో నో క్యాస్ట్, నో రిలీజియన్ అనే కాలమ్‌ను తప్పకుండా చేర్చాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడాన్ని కుల, మతాంతర వివాహాల రక్షణ ఐక్య వేదిక చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ హర్షం వ్యక్తం చేశారు. కులాన్ని మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందనీ, ఆ స్వేచ్ఛను అడ్డుకునే హక్కు ఎవ్వరికీ లేదని తెలిపారు. అలాంటి దరఖాస్తులను తిరస్కరించే హక్కు ఏ అధికారికి లేదనీ, ఆ మేరకు మున్సిపాల్టీ కమిషనర్లకు, విద్యాశాఖ కమిషనర్లకు న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయటం మంచి పరిణామమని పేర్కొన్నారు. అలాంటి అప్లికేషన్లను తిరస్కరించే పద్ధతి రాజ్యాంగంలో లేదనీ, అది లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఆర్టికల్ 14, 19, 21 25ను ఉల్లంఘించటమే అవుతుందంటూ జస్టిస్ కన్నెగంటి లలిత చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇది ఒక సంచలన తీర్పు అని కొనియాడారు. దీనిని తక్షణమే అమలు చేయాలని కోరారు.

దోస్త్ మూడో విడత సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 26

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఈనెల 26 వరకు ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి ఈ నెల 26 వరకు మొదటి, రెండు, మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన వారు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. 26 నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈనెల 28 నుంచి 31 వరకు దోస్త్ ఇంట్రా కాలేజీ విడత ద్వారా వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలని తెలిపారు. వచ్చేనెల ఒకటిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. కాలేజీల్లో సీట్లు ధ్రువీకరించుకున్న విద్యార్థులే ఇంట్రా కాలేజీ విడతకు అర్హులని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

ఉద్యోగ భద్రత లేదు.. కనీస వేతనం లేదు..

- గురుకులాలతో సమానంగా ఫలితాలు సాధిస్తున్నా గుర్తింపు లేదు
- అమలుకు నోచుకోని పిఆర్‌సి కమిటీ సిఫారసులు
- కేర్‌టేకర్, నైట్‌డ్యూటీలతో మానసిక ఒత్తిడి
- కెజిబివి, యుఆర్‌ఎస్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి), అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు (యుఆర్‌ఎస్), సమగ్ర శిక్షలోని ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయినా వారికి ఉద్యోగ భద్రత లేదు, కనీస వేతనం అమలు కావడం లేదు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఎంప్లాయిస్‌తో సమానంగా కెజిబివి, యుఆర్‌ఎస్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనమివ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారికి కనీస వేతనాన్నే అమలు చేయడం లేదు. 20 ఏండ్లుగా పనిచేస్తున్నా, గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం రావడం లేదు. సరైన గుర్తింపు దక్కడం లేదు. మరోవైపు వేతన సవరణ కమిషన్ (పిఆర్‌సి) కమిటీ సిఫారసులూ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో వారు మనోవేదనకు గురవుతున్నారు. హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్, సిఆర్‌టిలకు నైట్‌డ్యూటీలు వేయడంతో ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనమివ్వాలనీ, ఎస్‌ఒను ప్రిన్సిపల్‌గా, పిజిసిఆర్‌టిలను జెఎల్స్‌గా, సిఆర్‌టిలను స్కూల్ అసిస్టెంట్లుగా, పిఇటిలను పిడిలుగా గుర్తించి ఆ పోస్టు బేసిక్‌పేను చెల్లించాలనీ, పిఆర్‌సి సిఫారసు ప్రకారం కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగులకు ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ఇవ్వాలనీ, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కెజిబివి, యుఆర్‌ఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎల్ వినియోగానికి అర్హత కల్పించాలనీ, నెలకు రెండు సీఎల్స్ అనే పరిమితిని ఎత్తేయాలనీ, గురుకులాల పద్ధతిలో నిర్వహిస్తున్నందున వారికి వసతి కల్పించాలనీ, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి అనుగుణంగా కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆయా డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చలో ఎస్‌పిడి కార్యాలయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది ఉద్యోగులు జోరు వానలోనూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయాన్ని దిగ్బంధించారు. కనీస వేతనం ఇచ్చేదాకా కదిలేది లేదంటూ ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అక్కడే బైఠాయించారు. అనంతరం 29 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు కె జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, రాష్ట్ర కార్యదర్శి వి శాంతికుమారి కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే వీలైనంత త్వరగా చర్చలకు ఆహ్వానిస్తామంటూ అధికారులు సానుకూలంగా స్పందించారు. రెండు వారాల్లో సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కెజిబివి, యుఆర్‌ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనమివ్వాలి. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలి. శాసనమండలిలో ఈ అంశాలను పలుసార్లు ప్రస్తావించినా పరిష్కరించకపోవడం ఆందోళనకరం. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలి.

సత్వరమే పరిష్కరించాలి
కె జంగయ్య, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

కెజిబివి, యుఆర్‌ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలి. ఆరోగ్యకార్డులను ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలి. అర్ధాంతరంగా మరణించిన కెజిబివి, యుఆర్‌ఎస్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. పార్ట్‌టైం కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఒకేషనల్ ట్రైనర్లకు పూర్తికాలం పనిచేస్తున్నందున సిఆర్‌టిలుగా మార్చి బేసిక్ పే ఇవ్వాలి.

మంత్రులకు విన్నవించినా ఫలితం లేదు
చావ రవి, టిఎస్‌యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ఆందోళనలు చేసినా ఫలితం లేదు. అందుకే డిఎస్‌ఈని ముట్టడించాల్సిన పరిస్థితి అనివార్యమైంది. మోడల్ స్కూల్ హాస్టల్ నిర్వహణ అదనపు బాధ్యతల నుంచి ఎస్‌ఒలను తప్పించాలి. విద్యార్థుల పర్ క్యాపిటాను గురుకులాలతో సమానంగా పెంచాలి. బాలికలకు కాస్మోటిక్ చార్జీలు, శానిటరీ కిట్లను అందించాలి. జూనియర్ కళాశాలలకు అదనపు సిబ్బందిని, అదనపు నిధులను కేటాయించాలి. యూఆర్‌ఎస్‌లలో తొమ్మిది, పది తరగతులను ప్రారంభించాలి. వాటికి స్వంత భవనాలు నిర్మించాలి. యుఆర్‌ఎస్‌లలోని మహిళా ఉద్యోగులకూ 180 రోజుల ప్రసూతి సెలవులివ్వాలి కెజిబివి, యుఆర్‌ఎస్ ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలి.

నేడు మంత్రి ఎర్రబెల్లితో చర్చలు

- జిపి ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జిపి కార్మికుల సమ్మె నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సంఘాల జెఏసితో శనివారం ఉదయం చర్చలు జరిపేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అంగీకరించారు. శుక్రవారం ఈ మేరకు జెఎసి చైర్మన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి దయాకర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చల్లో పాల్గొనేందుకు జెఏసా రాష్ట్ర నాయకత్వం అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నాడు హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జెఏసి చైర్మన్ పాలడుగు భాస్కర్ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, ప్రభుత్వమే వేతనాలు చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులు, కనీసవేతనం రూ.19 వేల చెల్లింపు, కారోబార్లు, బిల్ కలెక్టర్లను గ్రామ సహాయ కార్యదర్శులుగా నియమించటం, మల్టీపర్పస్ విధానం రద్దు, జీవో నెంబర్ 51 సవరణ, తదితర అంశాలను మంత్రి ఎర్రబెల్లి దృష్టికి వారు తీసుకెళ్లారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శించొద్దనీ, వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని వారు మంత్రిని కోరారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్మికుల జెఏసి నేతలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆహ్వానించారు.

సక్సెస్‌ఫుల్ స్టార్టప్ తెలంగాణ

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌లో సక్సెస్‌ఫుల్ స్టార్టప్ తెలంగాణ రాష్ట్రమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించకపోయినా తెలంగాణ నేడు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. శుక్రవారం ఇక్కడ 'ఛాలెంజెస్ ఆఫ్ బీయింగ్ ఏ యంగ్ స్టేట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడారు. "తెలంగాణ ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా రాష్ట్రం కోసం పోరాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. జూన్ 2, 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడుతుందని మాట్లాడారు. కరెంట్, నీటి విషయంలో ఇవాళ తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించుకున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇస్తున్నాం. ఇప్పుడు తెలంగాణ ఏం చేస్తుందో.. భారత్ అనుసరిస్తోంది. తెలంగాణ రాకముందు ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. నేడు అలాంటి సమస్యలు తగ్గాయి. తెలంగాణ మోడల్ అంటే సమగ్ర, సమ్మిళిత, సమీకత, సమతుల్య అభివృద్ధి అని అర్థం. హరితహారం కార్యక్రమం ద్వారా ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో 7.7 శాతం అటవీ ప్రాంతం పెరిగింది.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలి

- 25న సంఘీభావ కార్యక్రమాలను జయప్రదం చేయాలి
- సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను ఇద్దరిని నగ్నంగా ఊరేగించి, సామూహిక లైంగికదాడి చేసి, హత్య చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పార్టీల సభ్యులు, ప్రజాసంఘాలు, వామపక్ష శ్రేయోభిలాషులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న మెయితీలకు, కుకీ, నాగ గిరిజన తెగల మధ్య బిజెపి చిచ్చుపెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మెయితీలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరంచేస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ, నాగ తెగలపై మతోన్మాదశక్తులు బిజెపి అండతో రెండున్నర నెలలుగా తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని వివరించారు. గృహ దహనాలు, చర్చీలతోపాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర, మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు బాధ్యత వహించి దోషులను శిక్షించాలనీ, బాధితులకు న్యాయం చేయాలనీ, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని తమ్మినేని, కూనంనేని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

నీటి నాణ్యత పరీక్షలు రెట్టింపు

- జలమండలి ఎండి దానకిశోర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం చేస్తున్న నీటి నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలని జలమండలి ఎండి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డైరెక్టర్లు, సిజిఎంలు, జిఎంలు, డిజిఎంలు, ఇతర అధికారులతో ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో దానకిశోర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.'ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, సీవర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను ఆయా డీజీఎంలు తనిఖీ చేయాలి. సంబంధిత సిజిఎంలు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలి. వర్షం కారణంగా రహదారులపై ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద సీవరేజ్ ఓవర్ ఫ్లోపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలి. లోతైన మ్యాన్‌హోళ్లు, మురుగు ఉప్పొంగే ప్రాంతాలను సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్మికులు పని ప్రదేశాల్లో తప్పనిసరిగా హెల్మెట్లు, గ్లౌజులు, గమ్ బూట్స్ ధరించడంతో పాటు ఇతర రక్షణ చర్యలు పాటించేలా చూడాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేయాలి. వీటిని క్వాలిటీ అనాలసిస్ వింగ్ జనరల్ మేనేజర్, ఇతర అధికారుల సమన్వయంతో పంపిణీ చేయాలి. పోలీసు అధికారులతో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకోవాలి" అని అధికారులకు దానకిశోర్ సూచనలు చేశారు.

IN THE COURT OF THE MACT CUM XXVI CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No.1464 OF 2021
BETWEEN:
Kancha Sharamandha.
...Petitioner.
AND
Syed Shadulla and others.
...Respondents.
To,
Syed Shadulla,
S/o. Guda Sahab Syed, aged major,
occ: Owner of Goods Carriage (DCM)
No.TS 07 UE 3036, R/o., P.No.798,
Brundhavan colony, Hayathnagar,
Ranga Reddy District.
...Respondent No.1.

Please take notice that the Petitioner has filed the above O.P. for claiming compensation for death of son of the petitioner i.e, Kancha Raju Kumar in a road accident which was occurred on 19/03/2021 at 00.20 hours at near Yakthapur X Road, Itikyala Mandal, Jogulamba, Gadwal caused by your DCM vehicle bearing No.TS-07-UE-3036. The said O.P. is posted to 09.08.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before the Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided in your absence.
Hence this notice.

BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet,. Hyderabad
Ph: 7673904549, 9330489999

IN THE COURT OF THE MACT CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No.89 OF 2023
BETWEEN:
Bushigari Shivamma and others.
...Petitioners.
AND
TSRTC and others.
...Respondents.
To,
N.Shankar S/o Laxman, aged Major,
Driver of TSRTC Bus bearing No.
TS-07-Z-4077, Staff No.210901,
R/o:Plo no.421, Sagar Complex,
Vinayaka Hills, B.N.Reddy Nagar,
R.R. District
...Respondent No.3.

Please take notice that the Petitioners have filed the above O.P. for claiming compensation for death of husband of the petitioner No.1 i.e, Bushigari Vinay Kumar in a road accident which was occurred on 02/12/2022 at 21:30 hours at near Rangamahal X road, CBS, Afzalgunj in the limits of P.S.Afzalgunj caused by your TSRTC bus bearing No.TS-07-Z-4077. The said O.P. is posted to 31.08.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided in your absence.
Hence this notice.

BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
Ph: 7673904549, 9330489999

స్తంభించిన జనజీవనం

- ప్రాజెక్టుల్లోకి వరద నీటితో గేట్లు ఎత్తివేత
- మత్తడి పోస్తున్న చెరువులు, కుంటలు
- నీట మునుగుతున్న పంట పొలాలు
- పునరావాస కేంద్రాలకు ముంపు ప్రాంత ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. రహదారులపై వరద నీరు చేరి వాహన, పాదచారులకు ఇబ్బందికరంగా మారాయి. పంట పొలాల్లోకి కూడా వర్షపు నీరు భారీగా వచ్చి చేరడంతో పంట నీట మునిగే పరిస్థితులు నెలకొన్నాయి. శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగళూర్ గేట్ నుంచి మై హోమ్స్ వెళ్ళే దారిలో ఉన్న వాగు నిండి రోడ్డుపైకి నీరు వస్తోంది. కడ్తాల్ మండలంలోని టాకురాజుగూడ గ్రామంలో వర్షం ధాటికి ఓ ఆవు, దూడ మృత్యువాతపడ్డాయి. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం మైలారం మొండికుంట చెరువు అలుగు పారడంతో కొత్త తండా చింతకుంట గ్రామానికి పోయే రోడ్డు మార్గంలో అంపల్లికి చెందిన డ్రైవర్ వరదలో చిక్కుకున్నాడు. స్థానికులు అప్రమత్తమై మరో ట్రాక్టర్ సహకారంతో డ్రైవర్‌ని కాపాడారు. నవాబుపేట మండలం చించల్‌పేట్ గ్రామంలో మూసినదిపై నిర్మించిన వంతెన (బ్రిడ్జి) వద్ద వరద ఉధృతిని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పరిశీలించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం సమీపంలోని బీమలింగం మూసీ నది వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రయాణికులను దారి మళ్లిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లిలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలేరు మండల కేంద్రంలో ఈదుల వాగు, రత్నాల వాగు పొంగిపొర్లుతున్నాయి. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో కౌలు రైతు యాట ముత్యాలు వ్యవసాయ బావి వద్ద విద్యుద్ఘాతానికి గురై మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మోదీన్‌పురం ఆవాసం పాండ్యానాయక్‌తండాలో ధరావత్ మధు(23) తన పొలం గట్ల మీద నడుస్తుండగా అప్పటికే తెగిపడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగలడంతో విద్యుద్ఘాతమైంది. సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మంజీర నదిలోనికి వరద నీరు వచ్చి చేరుతోంది. ఘనపూర్ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. సంగారెడ్డి జిల్లా పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజార్శిషా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్ సూచించారు. అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం షెరిగుడా గ్రామంలో గొల్ల మల్లేశ్ ఇంటి కప్పు కూలిపోయింది. కృష్ణ మండలం అయినాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే వంతెన కిందకు భారీగా నీరు చేరింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని మొట్ల తిమ్మాపురంలోని వట్టే వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు రోజులుగా గ్రామం జలదిగ్బంధంలో ఉంది. కాచినపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి గోగ్గల పాపారావు(60) మూర్ఛ వ్యాధి వచ్చి వాగులో పడిపోయి మృతిచెందారు. జనగామ జిల్లా జఫర్గఢ్ మండల కేంద్రానికి చెందిన గొర్ల కాపరి ముడికే కొమురయ్యకు చెందిన గొర్రెలు, మేక విద్యుద్ఘాతంతో మృత్యువాతపడ్డాయి. తరిగొప్పుల మండలం అక్కరాజు పల్లి గ్రామంలో తాటి పోచయ్య ఇల్లు కుప్పకూలింది. ములుగు జిల్లా మంగపేట తహశీల్దార్ కార్యాలయంలోకి వర్షం నీరు వచ్చి చేరింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు నీటిమట్టం 25 అడుగులు దాటిందని నీటిపారుదల శాఖ ఏఈ హర్షద్ తెలిపారు. వరంగల్ జిల్లా పాకాల సరస్సు నీటిమట్టం 19 అడుగులకు చేరుకోగా, మాదన్నపేట పెద్ద చెరువు 17 అడుగులకు గాను 16 అడుగుల నీరు చేరుకొంది. మరో రెండ్రోజుల్లో మత్తడి పడే అవకాశాలు ఉన్నాయి. గురిజాల పెద్దం చెరువు లోలెవల్ కాజ్ వే వరద ప్రవాహం తీవ్రంగా ఉండగా రాకపోకలు స్తంభించాయి. మహబూబాబాద్ జిల్లాలోని మినీ బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా తదితర నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పంటలన్నీ నీట మునిగాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాలలో గోదావరి నీటి మట్టం పెరగడంతో సమీపంలో నిర్మించిన మాతాశిశుసంరక్షణ కేంద్రాన్ని అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. బోథ్ మండలం ధన్నూర్(బి) గ్రామంలో జుపాక రాజేశ్వర్ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం గిన్నెర పంచాయతీ పరిధిలోని తోయగూడ గ్రామానికి చెందిన కొడప రాంబాయి మృతి చెందడంతో వాగుదాటలేక మృతదేహాన్ని ఎడ్లబండ్ల సాయంతో ఊరికి చేర్చారు. హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండీ, చిలకలగూడ, బేగంపేట, ప్యారడైజ్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం తర్వాత నగరంలో వర్షం కాస్త తగ్గడంతో ప్రజలు బయటకు రావడం కనిపించింది. హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ హిమాయత్ నగర్‌లోని ఆదర్శ బస్తీలో ముంపునకు గురైన ప్రాంతంతోపాటు నల్లకుంటలోని పద్మ నగర్, నాగయ్య కుంట అడిక్‌మెట్ ప్రాంతాల్లో నాలా పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పరిశీలించారు. హిమాయత్ నగర్ స్ట్రీట్ నెం.14 లోతట్టు ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి నాలా పొంగి ఇండ్లలోని రావడంతో మాన్సూన్ ఎమర్జెన్సీ టీంతో పాటు డీఆర్‌ఎఫ్ టీంలు మోటర్లు పెట్టి నీటిని బయటకు పంపించారు.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీరు విడుదల

ఎగువన ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో మేడిగడ్డ బ్యారేజీ 75 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. మేడిగడ్డలో 93.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అన్నారం బ్యారేజీ 56 గేట్లు ఎత్తి 1,26,000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టులోని 14గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాత్నాల, గడ్డెన్నవాగు, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని విడిచిపెడుతున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగులపై నుండి నీరు పొంగిపొర్లుతూ మంజీరా నది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లారెడ్డిలోని కల్యాణి ప్రాజెక్టుగేట్లు ఎత్తారు. నిజామాబాద్ జిల్లా సాలూర వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాని పై నుంచి రాకపోకలు నిషేదిస్తూ రెవెన్యూ అధికారులు కందకం తవ్వారు. కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతికి శివాలయం మునిగిపోయింది. ఎస్సారెస్పీకి 59 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మెదక్ జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా 20.136 టీఎంసీలకు చేరుకుందని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ చెరువులకు వరద పోటెత్తింది. హిమాయత్‌సాగర్ రెండు గేట్లను ఎత్తి 700 క్యూసెకుల నీటిని దిగువకు వదిలేశారు.

నేడు 'గోల్డెన్ గేట్'లో స్పాట్ ప్రవేశాలు

- హైదరాబాద్ విద్యార్థులకు అవకాశం

ప్రజాశక్తి-హైదరాబాద్

అమెరికాలోని గోల్డెన్ గేట్ యూనివర్శిటీలో అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ఆ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ డేవిడ్ ఫైక్ తెలిపారు. ఇందుకోసం శనివారం హైదరాబాద్‌లో ప్రత్యేక క్యాంపెయిన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. యూనివర్శిటీ హబ్ భాగస్వామ్యంతో నగరంలోని అర్హులైన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నామన్నారు. దీనివల్ల మేనేజ్‌మెంట్, ఐటి, ఇంజినీరింగ్ విభాగాల్లోని పలు కోర్సులలో విద్యార్థులకు అపారమైన అవకాశాలు లభిస్తాయన్నారు. అమీర్‌పేట్‌లోని ఆదిత్యా పార్క్‌లో ప్రవేశాల ప్రక్రియకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హాజరు కావచ్చని తెలిపారు. యూనివర్సిటీ హబ్‌తో భాగస్వామ్యం వల్ల విద్యార్థుల దరఖాస్తులను త్వరగా ప్రాసెస్ చేసి, వారికి అవసరమైన ఐ-20 డాక్యుమెంట్లను కూడా వీలైనంత త్వరగా అందిస్తామన్నారు.

నక్షత్ర జ్యూవలరీ నుంచి కొత్త కలెక్షన్లు

హైదరాబాద్ : నాణ్యమైన అనుకరణ, ఒక్క గ్రాము బంగారు అభరణాలను విక్రయించే నక్షత్ర జ్యూవలరీ పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని నూతన కలెక్షన్లను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ప్రస్తుత శ్రావణమాసం, రాబోయే వినాయక చవితిని దృష్టితో పలు రకాల కొత్త అభరణాలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇవి తమ భాగస్వాములను మరో అడుగు ముందుకు వేయడానికి మద్దతును అందించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేసింది. వినూత్న ఉంగరాలు, చెవిపోగులు, లాకెట్లు, నెక్లెస్, హారాములు, బ్యాంగిల్స్, బ్రాస్‌లెట్‌లు, బ్రైడల్ సెట్‌లు, ముక్కు పిన్నులు మొదలైన అందమైన అనుకరణ ఆభరణాల డిజైన్‌లు ఆన్‌లైన్‌లో లభిస్తాయని తెలిపింది.

జిపి కార్మికులపై కర్కశం

- 16 రోజులైనా స్పందించని సర్కార్
- మా బతుకులకు భరోసా ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తాం : కార్మికులు
- పలువురు నేతల సంఘీభావం

వినూత్నంగా మోకాళ్లపై నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచడంలో కీలక పాత్ర వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో చెత్త పేరుకుపోతున్నా.. ముసురు వర్షాల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదు.. అటు కార్మికులపై కనికరం చూపడం లేదు.. చర్చలకు దిగిరావడం లేదు. మరోవైపు కార్మికులను నయానో భయానో బెదిరించి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, పలువురు సర్పంచులు యత్నిస్తున్నారు. అయినా వెనక్కి తగ్గని జిపి కార్మికులు తమ బతుకులకు భరోసా ఇచ్చే వరకు తగ్గేది లేదంటూ సమ్మె కొనసాగిస్తున్నారు.

హయత్‌నగర్‌లోని మండల కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, సర్పంచ్‌లు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ పని విధానంలో అవగాహన లేని పనులు చేసే సమయంలో కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగితే మాదే బాధ్యత అని అధికారులు, సర్పంచ్‌లు రాసిస్తారా అని ప్రశ్నించారు. కార్మిక సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు ఎంపిడివొ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరుకుంది. ఎంపిడిఒ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట జిపి కార్మికుల సమ్మెకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య మద్దతు తెలిపి, ఆర్థిక సహాయం అందజేశారు. రామన్నపేటలో బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి ప్రదర్శిని సంఘీభావం తెలిపారు. బొమ్మలరామారంలో రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తిలో గ్రామపంచాయతీ కార్మికుల పట్ల కార్యదర్శుల వేధింపుల అరికట్టాలని డిమాండ్ చేశారు. తిప్పర్తి కార్యదర్శి వైఖరిని నిరసిస్తూ మార్కెట్ యార్డ్ నుంచి గ్రామపంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నల్లగొండ నియోజకవర్గం గ్రామ పంచాయతీ కార్మికులంతా ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్ పాల్గొన్నారు. చండూర్‌లో భిక్షాటన చేశారు. పెద్దవూరలో జిపి కార్మికుల సమ్మెకు మహాజన సోషలిస్టు పార్టీ మద్దతు తెలిపింది.

మహబూబాబాద్ జిల్లా గార్లలో ద్విచక్ర వాహనాల ర్యాలీ తీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలో జేఏసీ నాయకులు దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా మంచాలలో పంచాయతీ కార్మికులు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలి పారు. వీరికి సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు.

మణిపూర్ ఆకృత్యంపై ఆగ్రహం

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం
- ఆ రాష్ట్ర సిఎం రాజీనామాకు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లోని కాంగ్‌ఫోక్సీ జిల్లాలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను వివస్త్రలుగా ఊరేగించి లైంగిక దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ ఆకృత్యాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

ఐద్వా, కెవిపిఎస్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న అఘాయిత్యాలపై ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి బాధిత మహిళల కుటుంబ సభ్యులను హత్య చేసినట్టు కూడా వార్తలు వస్తున్నాయని అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, సహాయ కార్యదర్శి గాదె నరసింహ, బొల్లు రవీందర్, తక్కెళ్ళపల్లి శ్యామ్, ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, అధ్యక్షులు తుమ్మల పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మిర్యాలగూడలో సిఐటియు, బంజారా, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవరకొండలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

కేంద్రం ద్రిష్టి బొమ్మను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ఐద్వా ఆధ్వర్యంలో ఎఎంసి కాలనీలో నిరసన తెలిపారు. కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని పాత కొత్తగూడెం గౌతమ్‌నగర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఖమ్మం నగరంలోని జడ్పి సెంటర్‌లో ఐద్వా, పిఒడబ్ల్యు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

వట్టిపోయిన శ్రీశైలం, జూరాల రిజర్వాయర్లు

- గత ఏడాది జులై 21న జూరాలలో 8.42 టిఎంసిలు
- తాజాగా డెడ్ స్టోరేజ్
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ఏడాది జులై 7వ తేదీ నాటికే భారీ వరదల వల్ల జూరాలతోపాటు శ్రీశైలం గేట్లను తెరిచారు. ఈ ఆ జలాశయాలు వెలవెల పోతున్నాయి. వరదలు మరింత ఆలస్యమైతే వరి నాట్లకు ఇబ్బందులు తప్పేలా లేదు. ప్రధానంగా శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా నిర్మించు కున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో ఉన్న ఆయకట్టు అంతా బీళ్లుగా మారే అవకాశాలున్నాయి. జూరాలది అదే పరిస్థితి. ఈ రిజర్వాయర్ మీద నెట్టెంపాడు, రామన్‌పాడు, బీమా వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. రెండు రిజర్వాయర్ల పరిధిలో సుమారు ఐదు లక్షల ఎకరాలకుపైగా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. రిజర్వాయర్లోకి నీటి చుక్క రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఈపాటికే భారీ వరదలు వచ్చి కృష్ణానది పరవళ్లు తొక్కింది. ఈసారి ఆ పరిస్థితులు లేవు. జూరాల నీటి సామర్థ్యం 1045 అడుగులు, 9.66 టిఎంసిలు. అయితే, 3.95 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. గత ఏడాది జులై 21న 8.42 టిఎంసిల నీరు ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో 885 అడుగుల నీళ్లు రావాలి. 33.58 టిఎంసిల నీళ్లు నిల్వ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ సారి చాలా తక్కువగా ఉంది. జూరాలలో ఐదు టిఎంసిల నీళ్లు తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో నదులు ఎండి పోయాయి. రిజర్వాయర్లన్నీ వెలవెలబోతున్నాయి. వీటి అను బంధంగా కృష్ణ, తుంగభద్ర, భీమా నదులు ఎండిపోయాయి. ఎగువ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో వర్షాలు లేకపోవడంతో వరదలు లేవు.

సాగు భూములు బీడు

రిజర్వాయర్ల కింద సాగయ్యే భూములు నీరు లేక బీడుగా మారాయి. సుమారు ఆరు లక్షల ఎకరాల ఆయ కట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌లో సాగయే సోనా, మసూరి, బాపట్ల, సాంబార్లు ఐదు నెలలకు దిగుబడి వస్తుంది. వర్షాలు ఆలస్యం కావడంతో ఈ పంటలు సాగు ఈసారి కష్టమే. సాగు చేసినా తెగుళ్ల వచ్చి దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. హంస సాగైతే దిగు బడి తక్కువగా ఉంటుంది. వాతావరణ పరిస్థితు లను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

లలిత సంగీత శిఖరం చిత్తరంజన్ కన్నుమూత

- ఆకాశవాణిలో మూడు దశాబ్దాలు స్వరకర్తగా సేవలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొలితరం లలిత సంగీత శిఖరం.. డాక్టర్ మహాభాష్యం చిత్త రంజన్(85) శుక్రవారం ఉదయం హైదరాబాద్ కొత్తపేటలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆకాశవాణిలో మూడు దశాబ్దాలపైగా లలిత సంగీతం స్వరకర్తగా, అధికారిగా, గాయకుడిగా పనిచేశారు. దూరదర్శన్ తెలుగు కార్యక్రమాలు ప్రారంభం నుంచి ఆయన విధులు నిర్వర్తిహించారు. ప్రసిద్ధ కవులు సినారే, దాశరథి దేవులపల్లి కృష్ణశాస్త్రి తదితరుల లలిత గీతాలను స్వర పరచి వాటికి ప్రాచుర్యం కల్పించారు. ఆకాశవాణిలో ఈ పాట నేర్చుకొందాం, కలిసి పాడుదాం కార్యక్రమ రూప కల్పనలో ఎందరో గాయనీ గాయకులను చిత్త రంజన్ పరిచయం చేశారు. ప్రభుత్వ పురస్కారాలు, సాంస్కృతిక సంస్థల సత్కారాలు ఎన్నో అందుకున్న చిత్తరంజన్ తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. తెలుగు విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం విభాగానికి కోర్సును రూపొందించి ఉపన్యాసకునిగా పనిచేశారు. ఆయన ముగ్గురు కుమార్తెలు సంగీతరంగంలో ప్రసిద్ధులు. చిత్తరంజన్ అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలువురి సంతాపం

చిత్తరంజన్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. గొప్ప సంగీత కళాకారున్ని కోల్పోయామని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ అన్నారు. తుది వరకూ లలిత సంగీతమే శ్వాసగా జీవించారని కొనియాడారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. లలిత సంగీతం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. పలువురు సంగీత కళాకారులు కలగా కృష్ణమోహన్ శశికళ, సురేఖ వికె దుర్గ, రమణకుమారి తదితరులు సంతాపం ప్రకటించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయమందించండి

- ఎస్‌పిలకు డిజిపి అంజనీకుమార్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సహాయ సహకారాలను అందించాలని పోలీసు అధికారులను రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో జలమయం అయ్యాయనీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో వర్షప్రభావిత ప్రాంతాల పోలీసు అధికారులు స్థానిక ముంపు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్షాలపై తగిన సూచనలు, జాగ్రత్తలను ప్రజలకు సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు అందించి వారు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా వరకు భారీ వర్షాల కారణంగా రోడ్లు తెగిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయనీ, ఆ ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సహాయపడాలని సూచించారు. భారీ వర్షాలు ముగిసే వరకూ ఉన్నతాధికారులెవ్వరు కూడా హెడ్‌క్వార్టర్లను వదలరాదని ఆదేశించారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో, గోదావరి ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా బాధిత ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడానికి రెవెన్యూ అధికారులకు సహకరించాలని సూచించారు. కాగా, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో భారీ వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కింది స్థాయి అధికారులకు తగిన సూచనలిస్తున్నట్టు రీజియన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేడు సిపిజిఇటి ప్రవేశ పరీక్ష ప్రిలిమినరీ 'కీ' విడుదల

- జర్నలిజం పరీక్ష రద్దు, ఆగస్టులో తిరిగి నిర్వహణ
- కొత్తగా డేటా సైన్స్ కోర్సుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల ఎనిమిది యూనివర్సిటీల్లో 50 పీజీ కోర్సులకు నిర్వహించిన సిపిజిఇటి ప్రవేశ పరీక్షల ప్రిలిమినరీ 'కీ'ని శనివారం సాయంత్రం విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. మొత్తం 69,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 60,464 మంది ప్రవేశ పరీక్ష రాశారు. ఈ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించే అభ్యర్థులు 2023కు సంబంధించిన కుల, ఆదాయ సర్టిఫికెట్స్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

22 నుంచి 25 అభ్యంతరాల స్వీకరణ

ఈ నెల 22 నుంచి 25 అర్ధరాత్రి వరకు ప్రిలిమినరీ 'కీ'లో తప్పులు, లోపాలు, అభ్యంతరాలు ఉంటే ఇ-మెయిల్‌కు లేదా స్వయంగా వచ్చి చెప్పొచ్చని సూచించారు. ఇక సిపిజిఇటి అడ్మిషన్స్ ప్రవేశ ప్రక్రియను ఆగస్టు 2వ వారంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కన్వీనర్ చెప్పారు.

జర్నలిజం పరీక్ష రద్దు

జర్నలిజం ప్రవేశ పరీక్షకు సంబంధించి సిలబస్‌లో పలు తప్పిదాలు జరగడంతో పరీక్షను తిరిగి ఆగస్టు మొదటి వారంలో నిర్వహించనునట్టు కన్వీనర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 955 మంది విద్యార్థులు తిరిగి పరీక్ష రాయొచ్చన్నారు. దీనిపై ఇటీవల ఎస్ఎఫ్ఐ విద్యార్థులు వినతిపత్రం అందజేసిన విషయం తెల్సిందే.

కొత్తగా ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుకు నోటిఫికేషన్

ఒక యూనివర్సిటీ, పలు కళాశాలల అభ్యర్థన మేరకు.. ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఆగస్టు మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి ప్రవేశ పరీక్ష నిర్వహించనునట్టు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి చెప్పారు.

ఆ ఐదు విభాగాల్లో నేరుగా ప్రవేశాలు

ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో సీట్ల సంఖ్యకన్నా దరఖాస్తులు తక్కువగా వచ్చిన అరబిక్, మరాఠీ, కన్నడ, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహించలేదు. ఈ ఐదు కోర్సుల్లో 10మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు చేసేందుకు సిద్ధంగా ఉంటే నేరుగా అడ్మిషన్స్ పొందే వేసులుబాటు కల్పించనున్నారు.

గుండెపోటుతో కరీంనగర్ డిఐఇఒ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డిఐఇఒ) టి రాజ్యలక్ష్మి శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. మూడున్నరేళ్లుగా డిఐఇఒ (ఎఫ్ఎసి) సేవలందిస్తునారు. టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరి, జూనియర్ లెక్చరర్, ప్రిన్సిపల్, డిఐఇఒ స్థాయికి చేరుకున్నారు. ఆమె భర్త పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో రిటైరయ్యారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో గల ఆమె నివాసంలో మృతదేహాన్ని ఉంచారు. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, డీఐఈఓ ఆఫీస్ స్టాఫ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. రాజ్యలక్ష్మి మృతి పట్ల జిల్లా మంత్రి గంగుల కమలాకర్ సంతాపం ప్రకటించారు.

వరద సహాయక చర్యల్లో పాల్గొనండి

- కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నాయని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమయంలో ప్రజలు పడుతున్న వరద కష్టాల్లో నాయకులు, కార్యకర్తలు పాలుపంచుకోవాలని ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయమయ్యాయని తెలిపారు. ప్రజలు వరద నీటితో చాలా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలతో ముంపునకు గురై ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక, పిల్లలకు పాలు, ఆహార పదారాలైనా ఇవ్వలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అండగా ఉండి వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు వెంట వెంటనే స్పందించి సహాయ చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

మెట్రోను పొగించండి

- సిఎం కెసిఆర్‌కు ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను పొడిగించాలని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్నికోరారు.ఈమేరకు శుక్రవారం సీఎంకేసీఆర్‌కు కోమటిరెడ్డి లేఖ రాశారు. హయత్‌నగర్(అబ్దుల్లాపూర్‌మెట్) వరకు హైదరాబాద్ నగరం ఆ వైపు వేగంగా విస్తరిస్తున్నదని తెలిపారు. ఎంతోమంది ప్రజలు హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు వెళ్లి అక్కడి నుంచి మెట్రోకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ లైన్‌ను పొడిగించే యోచన ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపేందుకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. రోజు రోజూకు వాహనాల రద్దీ పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ మార్గంలో జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మారుస్తున్నదని గుర్తు చేశారు. కేంద్రం రానున్న రోజుల్లో వాహనాల రద్దీ మరింత పెరుగుతున్నదని తెలిపారు. మెట్రో విస్తరణ జరిగితే ప్రయాణికులు సొంత వాహనాల వాడకం తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు.

ఆరోగ్య సేవకులపై అధికభారం

- ఆన్‌లైన్ పేరుతో ఒత్తిడి
- సమాన పనికి సమాన వేతనం కరువు
- ఇంకెప్పుడు రెగ్యులర్ చేస్తారని రెండో ఎఎన్ఎంల ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు చెబుతూ సేవలందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు పని ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నారు. నిత్యం ప్రజా ఆరోగ్యం కోసం పరితపించే రెండో శ్రేణి ఆరోగ్య కార్యకర్తల దుస్థితి దయనీయంగా మారింది. పని భారంతో సతమతమవుతున్నారు. ఇంత చేసినా సమాన పనికి సమాన వేతనం లేదు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న వీరికి గౌరవం లేదు.. ఉద్యోగ భద్రత లేదు. పనిభారం తగ్గించి రెగ్యులర్ చేయాలని రెండో ఎఎన్ఎంలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రెండో ఎఎన్ఎంలు ప్రభుత్వం అప్పగిస్తున్న అనేక పనులు చేస్తున్నారు. ఒక ఆరోగ్య కార్యకర్త పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటాయి. ఐదు వేల జనాభాకు వీరు సేవలు చేయాల్సి ఉంది. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. మహిళ గర్భం దాల్చింది మొదలుకొని కాన్పు అయ్యే వరకు రెండో ఎఎన్ఎంలే అన్నీ చూసుకోవాలి. పల్స్ పోలియో, ఒఆర్ఎస్ పంచడం, నట్టల నివారణ మాత్రలు వేయడం, ఎన్‌సిడి, బిపి, షుగర్, వంటి వ్యాధిగ్రస్తులకు మాత్రలు ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 700 మంది రెండో శ్రేణి ఎఎన్ఎంలు ఉన్నారు. రాష్ట్రంలో 4000 మందిపైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు కొంత కాలంగా తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని ఆందోళన చేస్తున్నారు.

ఆన్‌లైన్‌తో నలిగిపోతున్న ఎఎన్ఎంలు

ఒక వైపు ప్రజా ఆరోగ్య సేవల విషయంలోనే తలమునకలు అవుతుంటే.. మరోవైపు చేసిన పనులకు సంబంధించి ఆన్‌లైన్ చేయాలంటూ పై అధికారుల నుంచి రెండో ఎఎన్ఎంలపై ఒత్తిడి వస్తోంది. ఔట్ పేషెంట్ ఆన్‌లైన్, ఇన్‌పేషెంట్, బ్లడ్ కలెక్షన్, లెప్రసీ సర్వే, క్యాన్సర్ స్క్రీనింగ్, ఓరల్ కావిటి స్క్రీనింగ్, స్కూల్ ఎడ్యుకేషన్ ఇలా మొత్తం 20 సేవలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. కలెక్టర్ మొదలు వైద్య అధికారుల వరకు అందరూ ఆన్‌లైన్ సమాచారం అడుగు తారు. ఒక ఆరోగ్య కార్యకర్త గ్రామాల్లో సేవలందిస్తూ ఇవన్నీ చేయాలంటే సాధ్యం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 11 గంటలకు ఫోన్ చేసి సమాచారం అడుగుతారని, నెట్ రావడం లేదన్నా వినిపించుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇన్ని సేవలు చేసినా కనీస గుర్తింపు లేదు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి చావు ఖర్చులు అయినా ఎరగని క్షేత్ర స్థాయి సిబ్బంది ఉన్నారు.

జీతం తక్కువ ఖర్చులు ఎక్కువ

వేతనాలు తక్కువ ఇస్తూ.. అనేక ఖర్చులు వారిచేత పెట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యాక్సిన్ అమౌంట్ ప్రతి కార్యకర్తకూ ఇవ్వాలి. వచ్చినా పై అధికారులు తీసుకొని రెండు ఏఎన్ఎంలకు ఇవ్వడం లేదు. సేవలను ఆన్‌లైన్ చేయడానికి నెట్ బ్యాలెన్స్‌కు డబ్బులు ఇవ్వడం లేదు. నెట్‌కు ప్రతి నెలా రూ.నాలుగు వందలు, జిరాక్స్ కోసం ఆరు వందల ఖర్చు అవుతోంది. వైద్య రంగానికి సంబందించిన అనేక పనులను ఆపరేటర్ చేయాల్సి ఉండగా ఏఎన్ఎం నుండే చేయిస్తున్నారు. వీటికోసం వచ్చిన నిధులను సూపర్‌వైజర్లు తీసుకుంటున్నారని తెలిసింది. పల్స్ పోలియో అమౌంట్ సైతం అందడం లేదు. ఔట్ సోర్సింగ్‌కు చెందిన మూడో శ్రేణి సిస్టర్స్‌కు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు.

పని ఒత్తిడితో క్షీణిస్తున్న ఆరోగ్యం

సుగుణ, 2 ఏఎన్ఎం, నాగర్‌కర్నూల్

పదేళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నాం. రోజుకు 15 గంటలు పనిచేస్తున్నాం. ఆన్‌లైన్ సేవలతో విసిగిపోతున్నాం. పని ఒత్తిడితో ఆరోగ్యం చెడిపోతుంది. రాత్రి 11 తర్వాత కూడా సమాచారం అడుగుతున్నారు. ఒత్తిడి తట్టుకొని పనిచేస్తున్నా శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం లేదు.

వర్క్‌లోడ్ తగ్గించాలి

ఫసియోద్దీన్, రాష్ట్ర అధ్యక్షులు- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్

హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పని భారం తగ్గించి ఎనిమిది గంటల పని అమలు చేయాలి. ఇఎస్ఐ వర్తింపజేయాలి. ఎవరైనా ఉద్యోగి మరణిస్తే.. వారి కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తాం.

రెండో శ్రేణి ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

ఆర్.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగర్‌కర్నూల్

రెండో శ్రేణి ఎఎన్ఎంలు పనిభారంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఏళ్ల తరబడి పనిచేసినా వారిని రెగ్యులర్ చేయడం లేదు. పిఆర్‌సిని అమలు చేయడంలో పూర్తిగా వివక్ష చూపుతున్నారు. ఎటువంటి పరీక్షలు లేకుండా వీరిని రెగ్యులర్ చేయాలి. వంద శాతం గ్రాస్ శాలరీని అందజేయాలి.